




సుల్తానాబాద్‌లో రాములోరి కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం: ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులను ఆశీర్వదిస్తున్న పూజారి, ధర్మారం: సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, నర్సింహులపల్లిలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

రాములోరి కల్యాణం.. పులకించిన భక్తజనం



ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్ వేంకటేశ్వరాలయంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీ పెరిగిద్ది హనుమాండ్లు, శాస్త్రి నగర్, పూసాలలో బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం జరిపించారు. పలువురు వ్యాపారులు భక్తులకు ఉచితంగా అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్, శ్రీరాం నగర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరయ్యారు. అప్పన్నపేట, రాగినేడు, చందపల్లి, గుర్రాంపల్లి, మారెడుగొండ తదితర గ్రామాల్లో కల్యాణం జరిపారు. బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని అభయాంజనేయ స్వామి, అన్నపూర్ణకాలనీ చిలుకలయ్య, మల్కాపూర్‌లోని శివ పంచాయతన ఆంజనేయ స్వామి, టెంపరరీ టౌన్‌షిప్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీటీఎస్‌లో జరిగిన కల్యాణోత్సవానికి ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ అలోక్ త్రిపాఠి హాజరై, పూజలు చేశారు. కార్పొరేటర్ కొలిపాక సుజాత, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ శివ పంచాయతన ఆంజనేయ స్వామి దేవాలయంలో కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, భక్తులు హాజరయ్యారు. అన్నపూర్ణకాలనీ చిలుకలయ్య దేవాలయంలో ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ పూజలు నిర్వహించారు.

ధర్మారం: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు సీతమ్మతల్లికి ఒడిబియ్యం సమర్పించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, మండలంలోని నర్సింహులపల్లి, ఖిలావనపర్తి, బొట్లవనపర్తి, కమ్మరిఖాన్‌పేట, దొంగతుర్తి గ్రామాల్లో సీతారాముల కల్యాణం కనులపండువగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, పులకించిపోయారు.

కమాన్‌పూర్: మండలంలోని పలు గ్రామాల హనుమాన్ ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ–మాలతి దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. హనుమాన్ నగర్ శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. వకీల్‌పల్లి గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏరియా రక్షణ అధికారి రవీందర్, డీజీఎం సివిల్ ధనుంజయ దంపతులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీ పీటీఎస్ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

రామగుండం: పట్టణంలోని శ్రీ భక్తాంజనేయస్వామి, రామునిగుండాల కొండ, అబాది రామగుండం, అంతర్గాం రామాలయాల్లో, గోలివాడ, ముర్మూర్, పొట్యాల, ఆకెనపల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో శ్రీ సీతా రాముల కల్యాణం వైభవంగా జరిగింది. పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో వేడుకలకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్–మనాలిఠాకూర్, కార్పొరేటర్ కౌశిక లత–హరి దంపతులు హాజరయ్యారు. రామునిగుండాల కొండపై ఎమ్మెల్యే దంపతులు రాముల వారిని వేదికపైకి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సోదరుడు అయోధ్యసింగ్ ఠాకూర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు సత్కరించారు.

ఎలిగేడు: రాములపల్లి(ర్యాకల్‌దేవుపల్లి)లోని నాగలింగేశ్వరాలయం, సుల్తాన్‌పూర్‌లోని శ్రీలక్ష్మీనరసింహ, గోదాకృష్ణ సహిత శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, ఎలిగేడు శ్రీకోదండరామాలయం, ధూళికట్ట శివాలయంలలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సుల్తాన్‌పూర్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు, ఎంపీపీ స్రవంతి–మోహన్‌రావు, ఎలిగేడులో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

జూలపల్లి: కోనరావుపేట, కాచాపూర్, కుమ్మరికుంట రామాలయాల్లో, వడ్కాపూర్ శివాలయంలో, తెలుకుంటలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. జూలపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు చేశారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకటయ్య, వేణుగోపాల్‌రావు, కోనరావుపేటలో నల్ల మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఓదెల జెడ్పీటీసీ సభ్యులు రాములు, భక్తులున్నారు.

ఓదెల: ధర్మాన్ని కాపాడితే అది మిమ్మల్ని కాపాడుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఓదెల మండలంలోని పొత్కపల్లిలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ఆయన హాజరయ్యారు. సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి నాయకులున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని శ్రీరామాలయం, జగత్ మౌనీశ్వరాలయం, హరిహర క్షేత్రంతోపాటు పలు గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. జగత్ మౌనీశ్వరాలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలుతో రామరాజ్యం స్థాపన దిశగా ముందుకెళ్తున్నారని తెలిపారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముత్తారం: లక్కారం, మచ్చుపేట, కేశనపల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, ఇప్పలపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం జరిపారు. ముత్తారంలో శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగినేని జగన్‌మోహన్‌రావు–పద్మ దంపతులు రూ.8 లక్షల విలువైన వెండి ఆభరణాలు బహూకరించారు.

పాలకుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. బసంత్‌నగర్ శ్రీకోదండ రామాలయంలో కేశోరాం ఫ్యాక్టరీ మేనేజర్ గోవిందరావు, రాణాపూర్ రామాలయంలో కన్నాల సింగిల్‌విండో చైర్మన్ మనోహర్‌రెడ్డి దంపతులు పూజలు చేశారు. కన్నాల పంచాయతీ పరిధి కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవానికి కేశోరాం కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య దంపతులు హాజరయ్యారు.



పాలకుర్తి: కురుమపల్లిలో కల్యాణోత్సవం..



ముత్తారం: లక్కారం రామాలయంలో..



యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 జీఎం, అధికారులు..

ఫెర్టిలైజర్‌సిటీ: ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా పూజలు చేశారు.

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు హాజరయ్యారు. ఈవో శంకర్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



జూలపల్లిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కాల్వశ్రీరాంపూర్‌లో..



ఎలిగేడు: నాగలింగేశ్వరాలయంలో..



కమాన్‌పూర్: గుండారంలో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాల మేరకే ధాన్యం కొనుగోలు

సాక్షి స్పందన

పాలకుర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్‌సీఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకే ధాన్యం కొనుగోలు చేస్తామని, తేమ శాతం 17లోపు ఉండాలని, ఈ విషయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'తేమశాతం రాక.. గన్నీ సంచులు లేక' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 5 వేల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ధాన్యాన్ని తాలు లేకుండా శుభ్రం చేసిన తర్వాతే కేంద్రాలకు తీసుకురావాలని పేర్కొన్నారు. కొంతమంది శుభ్రం చేయకుండా వ్యవసాయ క్షేత్రాల నుంచి నేరుగా కేంద్రాలకు తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ కారణంగానే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, నాయకులు

ధర్మారం: మండల కేంద్రంలో భవాని కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు కొత్త నర్సింహం, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, గంధం మహేందర్, కాంపెల్లి రాజేశం, జవ్వాజి మధు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ఓదెల: కొలనూర్ గ్రామంలో కర్రె లకొష్మరెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాము బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. పెద్దపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో తనకు రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

రేపటి నుంచి మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్‌రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తల్లి మహమ్మాయిదేవి అని భక్తుల నమ్మకం. ఏటా చైత్ర మాసంలోఅమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వలలో క్రీస్తు పూర్వం 227 సంవత్సరంలో మహమ్మాయిదేవి స్వయంభూగా వెలసినట్లు చరిత్ర చెబుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు.

5 రోజులపాటు ఉత్సవాలు..

మహమ్మాయిదేవి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. 19న శుక్రవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ధ్వజారోహణం, ప్రధాన కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, హోమం, సాయంత్రం ఉమామహేశ్వర స్వామి కల్యాణోత్సవం, 20న మండపారాధనలు, సహస్ర నామ పూజలు, కుంకుమార్చనలు, హోమం, 21న సహస్ర నామ పూజలు, దేవీ అర్చన, రాత్రి భజనలు, సంకీర్తనలు, 22న డోలోత్సవం, చందనగోష్ఠి, కుంకుమార్చనలు, మహామంత్ర పుష్పం, బలిహరణం, 23న మండప పూజలు, హోమం, దీపోత్సవం, పూర్ణాహుతి, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకుడు రాధాకృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

రోడ్డు విస్తరణ పేరిట విధ్వంసం చేస్తే ఊరుకోం

• హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

గోదావరిఖని: రోడ్డు విస్తరణ పేరిట సింగరేణి విధ్వంసం చేస్తే ఊరుకోబోమని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని మర్చిపోయి, వారిని వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఓల్డ్ అశోక్ టాకీస్ కూల్చివేయడం, చౌరస్తా ప్రాంతంలో క్వార్టర్ల కూల్చివేతపై అత్యుత్సాహం చూపుతోందని పేర్కొన్నారు. సింగరేణికి చెందిన పోచమ్మ మైదానాన్ని కబ్జా చేసినా అప్పటి అధికారులు పట్టించుకోలేదన్నారు. రోడ్డు విస్తరణ పేరిట క్వార్టర్ల కూల్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దీనిపై జేబీసీసీఐ సంఘాలతో చర్చించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా యాజమాన్యం ఏకపక్షంగా ముందుకు సాగుతోందని మండిపడ్డారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, సంస్థ సీఎండీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాజకీయం జోక్యంతో కొత్త గనులు తీసుకువచ్చి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే సంతోషిస్తామన్నారు. జీడీకే–5 షాఫ్ట్, జీడీకే–11 షాఫ్ట్ వంటి నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేస్తే 10 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

జాగ్రత్తలతో వడదెబ్బకు దూరం



కార్మికులకు సూచనలిస్తున్న డాక్టర్ సుమన్

గోదావరిఖని: ముందు జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు దూరంగా ఉండొచ్చని సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ తెలిపారు. బుధవారం జీడీకే–1, 3 గనిపై కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో నీరు ఎక్కువగా తీసుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తాగాలన్నారు. ఎండలోకి వెళ్లాల్సి వచ్చినప్పుడు టోపీ లేదా తలపాగా ధరించాలని, సాధ్యమైనంత వరకు గొడుగు వాడాలని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. శీతల పానీయాలు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ రమేశ్‌బాబు, రక్షణ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి ఇక్బాల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీరు చేరిన పొలాల పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ: ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు చెరువు తూము గేట్ తెరవడంతో సమీప రామగుండం మండలంలోని జనగామ రైతుల పొలాల్లోకి నీరు చేరింది. వరి కోతకు వచ్చిన సమయంలో ఇలా జరగడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. బుధవారం కార్పొరేటర్ కవిత గ్రామ పోలీస్ అధికారి కృష్ణారెడ్డికి సమాచారం అందించారు. ఆయన రైతులతో కలిసి పొలాల వద్దకు వెళ్లి, పరిశీలించారు. దాదాపు రూ.60 లక్షల విలువైన పంట నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు.



కాగా, ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సన్మానం



సుల్తానాబాద్: తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన బొల్లి సత్యనారాయణను సంఘం జిల్లా సభ్యులు సత్కరించారు. బుధవారం సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజయ్, కోశాధికారి గోపికృష్ణ, జాయింట్ సెక్రటరీ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నియంత్రణపై ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ బుధవారం అవగాహన కల్పించారు. దవాఖానాల్లో ఫైర్ సేఫ్టీ సిస్టం, అత్యవసర ద్వారాలు ఉండాలని సూచించారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

• కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

రామగిరి: శ్రీరాముని కృపతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం సెంటనరీకాలనీ కోదండ రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి హాజరై, మాట్లాడారు. ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. విశాఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. ట్రస్టు చైర్‌పర్సన్ గడ్డం సరోజన సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ వనం రాంచందర్, నాయకులు కొరుకొప్పుల తులసీరాం, బండారి సదానందం, కాటం సత్యం, మేకల మారుతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సీతారాములకు పూజలు చేస్తున్న వంశీకృష్ణ

సానుభూతి కోసం చిల్లర రాజకీయాలు

• మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

ధర్మారం: పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల్లో సానుభూతి కోసం చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై ఓడిపోయిన ఆయన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ మాధవరావుచే సొంత పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులపైనే అసభ్యకర పోస్టులు పెట్టించారన్నారు. మాధవరావు, కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి మధ్య జరిగిన వ్యక్తిగత ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేస్తే దాన్ని కాంగ్రెస్‌కు ఆపాదించడం సరికాదని పేర్కొన్నారు. చిన్న గొడవను బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్‌కు స్క్రిప్టు రాసిచ్చి, మాట్లాడించటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓడిపోతానన్న భయంతోనే కొప్పుల ఈశ్వర్ ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కాడె సూర్యనారాయణ, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, బ్లాక్–2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, పీఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు దేవి జనార్దన్, వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నీటి సరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా సింగరేణి యాజమాన్యం అందిస్తున్న గోదావరినది తాగునీటి సరఫరాలో 10 రోజులపాటు అంతరాయం ఉంటుందని డీజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని ఇన్‌టెక్ వెల్ వద్ద మోటార్లకు, గోదావరిఖని నుంచి యైటింక్లయిన్‌కాలనీ వరకు పైపులైన్లకు మరమ్మతు కారణంగా యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ వాసులకు రోజు విడిచి రోజు నీరు వస్తుందని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు

మంథని: వేసవి, వానాకాలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంథని ఏఈఈ మల్లయ్య తెలిపారు. బుధవారం ఎక్లాస్‌పూర్ 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మంథని దారిలో లూజ్ లైన్ లేకుండా నాలుగు మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, మంథనిలోని సత్యసాయినగర్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, లోడ్ తగ్గించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో, బతుకమ్మ చౌరస్తా ఏరియాలో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయిస్తున్న ఏఈఈ మల్లయ్య